772) సాళంగనాట

ప॥ శ్రావణబహుళాష్టమి జయంతి నేడు ।సేవించరో నరులార శ్రీకృష్ణుడీతడు ॥

చ॥ పాలింప వసుదేవుని పాలిటి భాగ్యదేవత। దేవకి గనినట్టి దివ్యరత్నము।
చేవమీర సురలరక్షించేకల్పవృక్షము। యీవేళ జన్మించినాడు యిదె కృష్ణుడు ॥

చ॥ హరవిరించాదులకు నాదిమూలకారణము। పరమమునుల తపఃఫలసారము।
గరుడోరగేంద్రులకు గలిగిన నిధానము। యిరవుగా నుదయించె నిదె కృష్ణుడు ॥

చ॥ బలు యోగీశ్వరుల బ్రహ్మానందము। చెలగు భాగవతుల చింతామణి।
అలమేల్మంగకు పతి యట్టె శ్రీవేంకటాద్రి-। నిలపై జన్మించినాడు యిదె కృష్ణుడు ॥